టీఎన్‌జీవోస్ కాలనీలో అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న అధికారులు

లక్షలు కూడబెట్టి స్థలాలు కొన్నాం

- నిర్మాణాల కూల్చివేత అక్రమం
- టీఎన్‌జీవోస్ కాలనీలో బాధితుల గగ్గోలు
- ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు: తహసీల్దార్

మైలార్‌దేవ్‌పల్లి, అక్టోబర్ 23: 'లక్షలాది రూపాయలు కూడబెట్టి స్థలాలు కొన్నాం. రాత్రికి రాత్రి వచ్చి నిర్మాణాలను అక్రమంగా కూల్చి వేస్తున్నారు' అంటూ పలువురు బాధితులు గగ్గోలు పెట్టారు. హైదరాబాద్ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ టీఎన్‌జీవోస్ కాలనీ సర్వే నం 156/1లోని నిర్మాణాలను బుధవారం ఉదయం పోలీసుల భారీ బందోబస్తు నడుము రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. స్థలాల చుట్టూ ఉన్న ప్రహరీ నిర్మాణాలను జేసీబీలతో కూల్చివేశారు. ఈ సందర్భంగా బాధితులు అడ్డుకొని నిరసన వ్యక్తం చేశారు. కొందరు రాళ్లతో జేసీబీ అద్దాలను ధ్వంసం చేశారు. పోలీసులు వారిని వారించి అక్కడ నుంచి పంపించి నిర్మాణాలను కూల్చివేశారు. ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తే సహించేది లేదని ఈ సందర్భంగా రాజేంద్రనగర్ తహసీల్దార్ రాములు హెచ్చరించారు. ఇక్కడ ప్రభుత్వ స్థలాలను కొందరు ఆక్రమించి కబ్జాలు చేశారని, అందుకే నిర్మాణాలను కూల్చివేశామని తెలిపారు.

అనుమతులు లేని భవనాల సీజ్

వనస్థలిపురం పరిధిలో అనుమతులు లేని భవనాలెన్నో

వనస్థలిపురం, అక్టోబర్ 23: ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భహుళ అంతస్తుల భవనాలను జీహెచ్‌ఎంసీ అధికారులు సీజ్ చేశారు. సదరు భవనాలపై ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల మేరకు అధికారులు నిర్మాణదారులకు ఇదివరకే నోటీసులు జారీచేశారు. ఎలాంటి సమాధానం రాకపోవడంతో బుధవారం వాటిని సీజ్ చేశారు. సాగర్ కాంప్లెక్స్‌లోని ప్లాట్ నంబర్ 272, 285లో ఒక భవనం, బీఎన్‌రెడ్డినగర్ చౌరస్తాలోని ప్లాట్ నంబర్ 84లో ఒకటి, శ్రీపురం కాలనీలో ప్లాట్ నంబర్ 67లో ఒకటి, సచివాలయనగర్ లోని ప్లాట్ నంబర్ సీ-754లో ఓ భవనాన్ని అధికారులు సీజ్ చేశారు. మరోవైపు బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని సాగర్ కాంప్లెక్స్, శ్రీపురం కాలనీ, బీఎన్‌రెడ్డినగర్, వైదేహీనగర్, ఎస్కేడీనగర్, శ్రీరామ్ కాలనీలో దాదాపు అన్ని భవనాలూ అనుమతులు లేనివే.

ఇండ్ల కూల్చివేతకు మేం వ్యతిరేకం: రాఘవులు

హైదరాబాద్, అక్టోబర్ 23 (నమస్తే తెలంగాణ): మూసీ పునరుజ్జీవనం పేరిట నదికి ఆనుకొని ఉన్న ఇండ్లను తొలగించడానికి చేస్తున్న ప్రయత్నానికి సీపీఎం వ్యతిరేకమని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు విజయరాఘవన్, బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో బుధవారం నిర్వహించిన రాష్ట్ర కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. రివర్ బెడ్‌లో ఇండ్లు నిర్మించుకున్న వారికి ప్రత్యామ్నాయం చూపించాలని డిమాండ్ చేశారు. ట్రిపుల్ ఆర్‌కు మొదట నిర్ణయించిన అలైన్‌మెంట్‌నే అమలు చేయాలని సూచించారు. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయటంతోపాటు తక్షణమే రైతుభరోసా చెల్లించాలని డిమాండ్ చేశారు.

కూల్చివేతలు.. కిలోమీటర్!

చుంగ్‌గై తరహాలో మూసీ ఇరువైపులా ఆకాశహర్మ్యాలు.. సియోల్ పర్యటనలో తేల్చిన ఎంపీ, మంత్రులు

- ఆ నమూనా కావాలంటే బఫర్ జోన్ దాటి కిలోమీటర్ మేర 'కూల్చి' విస్తరించాల్సిందే!
- పీపీపీతో ప్రైవేట్ కంపెనీలకు రేవంత్ సర్కార్ రెడ్‌కార్పెట్
- మూసీ మధ్య ఎలివేటెడ్ కారిడార్‌కు బీఆర్ఎస్ ప్రణాళికలు
- తాజాగా మూసీకి ఇరువైపులా చేపట్టేందుకు ప్రతిపాదనలు

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, అక్టోబర్ 23 (నమస్తే తెలంగాణ): 'సియోల్ నగరంలో ఉన్న విధంగానే మన హైదరాబాద్ నగరం మధ్యలో నుంచి నది ప్రవహిస్తుంది. అందుకే సీఎం రేవంత్‌రెడ్డి ఇంతకు ముందు ఇక్కడికి టూర్‌కు వచ్చినప్పుడు ఈ విషయాన్ని తెలుసుకొని ఇప్పుడు మమ్మల్ని పంపించిండు. చుంగ్ గై చున్ పక్కనే రెస్టారెంట్లు, ఇవన్నీ (ఆకాశహర్మ్యాలు) వచ్చినయి. ఇవన్నీ పీపీపీ (పబ్లిక్-ప్రైవేట్ పార్ట్నర్‌షిప్) విధానంలో కట్టిన ప్రాజెక్టులు. హైదరాబాద్‌లోని మూసీని కూడా ఇట్ల తయారు చేస్తే ప్రపంచవ్యాప్త గుర్తింపు వస్తుంది'

- ఇవీ.. దక్షిణ కొరియా సియోల్‌లో చుంగ్ గై చున్ వాగు పక్కన నిలబడి భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి సెలవిచ్చిన వివరాలు.. సియోల్ పర్యటనకు వెళ్లిన మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ సైతం ఇదే తరహా అభిప్రాయాలు వ్యక్తంచేశారు.
- అంటే.. మూసీ ఇరువైపులా చుంగ్ గై చున్ వాగు పరిసరాల లెక్క మారుస్తారని సదరు మంత్రులు, ఎంపీ అధికారికంగానే చెప్పారు..మూసీ వెంట ఇంత పెద్ద ఆకాశహర్మ్యాలు రావాలంటే బఫర్‌జోన్ దాటి కిలోమీటర్ మేర విస్తరణ చేస్తారని మరోసారి చెప్పకనే చెప్పారు! ఇప్పటివరకు రేవంత్ సర్కారు బయటికి బఫర్‌జోన్ వరకు ఉన్న 10 వేల నిర్మాణాలనే కూల్చుతామని చెప్తున్నా.. ప్రజాసంఘాలకు ఇచ్చిన ప్రజెంటేషన్‌లో నదికి రెండువైపులా కిలోమీటర్ మేర అభివృద్ధి చేస్తామని పొందుపర్చారు. తాజాగా సియోల్ పర్యటనలో మంత్రులు సైతం ఇదే విషయాన్ని ధ్రువీకరించారు.

మూసీ ప్రాజెక్టులో ఇప్పటివరకు 150 నిర్మాణాలను కూల్చివేశారు. స్వచ్ఛందంగా వారే కూల్చుకున్నారని సీఎం రేవంత్‌రెడ్డి చెప్తున్నా.. ప్రభుత్వపరంగా బిల్లులు క్లెయిమ్ చేస్తుండటంతో అవి సర్కారు కూల్చివేతలేనని తేటతేల్లమైంది. ఈ నేపథ్యంలో అసలు 55 కిలోమీటర్ల మేర మూసీ వెంబడి రెండువైపులా ఎంత దూరం సుందరీకరణ ప్రాజెక్టు చేపడతారనే వాస్తవాలను కాంగ్రెస్ ప్రభుత్వం బయటికి చెప్పడం లేదు. కానీ తరచూ చోటు చేసుకుంటున్న పరిణామాలతో సర్కారు అంతర్గత వ్యూహం బట్టబయలవుతున్నది. కొన్నిరోజుల కిందట సాక్షాత్తూ మంత్రి శ్రీధర్‌బాబు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ప్రజా సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మూసీ సుందరీకరణ ప్రాజెక్టుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అందులో స్పష్టంగా నదికి రెండు వైపులా కిలోమీటర్ చొప్పున 55 కిలోమీటర్ల దాకా 110 చదరపు కిలోమీటర్ల మేర గ్రోత్‌కారిడార్‌గా అభివృద్ధి చేస్తామని కుండబద్దలు కొట్టారు. దీంతో రివర్ బెడ్‌లెవల్, బఫర్‌జోన్‌లోని నిర్మాణాలను కూల్చివేసి వారికి ప్రత్యామ్నాయంగా డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇస్తున్నారు. ఆపై కిలోమీటర్ వరకు నిర్మాణాలు, స్థలాలను భూసేకరణ చట్టం-2013 కింద సేకరించనున్నట్టు ప్రజా సంఘాలకు ఇచ్చిన ప్రజెంటేషన్‌లోనే స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని 'నమస్తే తెలంగాణ' వెలుగులోకి తెచ్చిన తర్వాత కూడా అటు ప్రభుత్వ, ఇటు అధికార యంత్రాంగం నోరు విప్పడం లేదు. వాస్తవానికి కిలోమీటర్ దాకా విస్తరణ లేకపోతే అదే విషయాన్ని ఎంఆర్‌డీసీఎల్ అధికారులు ప్రజలకు స్పష్టం చేయాల్సి ఉన్నది. కానీ మౌనం వహిస్తున్నారంటే ముస్ముందు అదే ప్రణాళిక అమలు చేయనున్నట్టు స్పష్టమవుతున్నది.

సియోల్ టూర్‌తో మరోసారి ఖరారు

మూసీ సుందరీకరణపై పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, మీడియా ప్రతినిధుల బృందం దక్షిణ కొరియాలోని సియోల్ టూర్‌కు వెళ్లిన విషయం తెలిసిందే. ఈ పర్యటనలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో పాటు భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి చుంగ్ గై చున్ వాగు పక్కన నిలబడి ఇదే తరహాలో మూసీని అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. పక్కన ఉన్న ఆకాశహర్మ్యాల్లో ఉన్న రెస్టారెంట్లు, ఇతర వాణిజ్య కేంద్రాలను చూపుతూ ఇట్లనే మూసీ వెంట అభివృద్ధి జరుగుతుందని సెలవిచ్చారు.

- ఈ లెక్కన మూసీ రివర్‌బెడ్, బఫర్‌జోన్‌లోని నిర్మాణాలను తొలగించి అందులోకి గోదావరి జలాలను ప్రవహింపజేస్తారు.
- రాష్ట్ర ప్రభుత్వమే మూసీ వెంట ఎలివేటెడ్ కారిడార్లు, రహదారులు, బ్రిడ్జిలు, మెట్రో రైలు నిర్మిస్తుంది.
- నదికి రెండువైపులా కిలోమీటర్ వరకు 110 చదరపు కిలోమీటర్ల ప్రాంతాన్ని పబ్లిక్-ప్రైవేట్ పార్ట్నర్‌షిప్ (పీపీపీ) విధానంలో ప్రైవేట్ కంపెనీలకు అప్పగిస్తుంది.
- పీపీపీ విధానంలో ప్రైవేట్ కంపెనీలకు ఎంత లాభం ఉంటుంది?, ప్రభుత్వానికి ఎంత ఆదాయం ఇస్తారు? ఇలా ప్రతి దశలో విధి విధానాల ఖరారు బాధ్యత మెయిన్ హార్ట్ కన్సార్టియం చూస్తుందని ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు.
- మూసీకి రెండువైపులా ప్రైవేట్ కంపెనీలు స్థలాలను 30-50 ఏండ్లకు లీజుకు తీసుకొని రెస్టారెంట్లు, వాణిజ్య సముదాయాలు, వినోద కేంద్రాలు నిర్మిస్తాయి. ఆదాయంలో ఒప్పందం మేరకు ప్రభుత్వానికి ఏటా కొంత చెల్లిస్తారు.

రెండువైపులా ఎక్స్‌ప్రెస్‌వే

బీఆర్ఎస్ హయాంలో మూసీ అభివృద్ధి ప్రణాళికలో ఒక్క నిరుపేద నిర్మాణాన్ని కూడా కూల్చవద్దంటూ అప్పటి సీఎం కేసీఆర్ స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో అందుకు అనుగుణంగా మంత్రులు, అధికారులు తగిన చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా మూసీ నది మీది నుంచి ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణానికి కేసీఆర్ ప్రభుత్వం ప్రణాళికలు తయారు చేసింది. అంటే మూసీ నదిలో పిల్లర్లు వచ్చి, నది పైనుంచి రోడ్డు ఉంటుంది. దీని ద్వారా ఎలాంటి నిరుపేదల నిర్మాణాలను కూల్చాల్సిన అవసరం ఉండదు. కానీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇప్పుడు అలా కాకుండా మూసీకి రెండువైపులా ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణాలను ప్రతిపాదించింది. అంటే నది సరిహద్దు నుంచి 250-350 ఫీట్ల చొప్పున స్థలం కావాలి. ఇలా రెండువైపులా భూములు సేకరించాలి.

ఇంతమంది ఉసురు పోసుకోడానికా సీఎంను చేసింది?

మూసీ కాల్వను శుభ్రం చేసి నీళ్లు పోసి గోడ కట్టుకోమను. ఆయన (సీఎం) చరిత్రల నిలబడుతడు. మూసీ మురికిపోయి దగ్గరున్నోళ్లు దోమలు, వాసన లేకుండా సంతోషంగా ఉంటరు. అది వదిలిపెట్టి అటు కిలోమీటర్, ఇటు కిలోమీటర్ కూలగొడుతరా ఎవరైనా? ఎవని జాగీరు?.. ఎవని సొమ్ము? కిలోమీటర్ అంటే మాటలా? ఈ జమానాలో అది సాధ్యమా? సిమెంట్, ఇసుక ఎంత ఖర్చు పెట్టి ఇల్లు కట్టుకుంటరు?. ఇంత అడ్రగనంగ మాట్లాడి, ఇంతమంది ఉసురు పోసుకునేందుకేనా ఆయన్ని సీఎంను చేసింది?

- శోభ, గృహిణి, మూసీ పరీవాహక ప్రాంతం

సియోల్‌లో మాటల గారడీ!

మూసీ సుందరీకరణ ప్రాజెక్టులో ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను తప్పించుకునేందుకు చివరికి సియోల్ లోనూ కాంగ్రెస్ నేతలు మాటల గారడీని అందుకున్నారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ చుంగ్ గై చున్ వాగు పునరుజ్జీవనం కంటే ముందు అక్కడ కేవలం నది మాత్రమే ఉండేదని అసత్యాలు వల్లించారు. వాస్తవానికి పునరుజ్జీవనం ప్రాజెక్టు 2003-05 వరకు జరిగితే.. అంతకుముందు ఎలాంటి నిర్మాణాలు ఉన్నాయో, ఆతర్వాత కూడా అవే ఆకాశహర్మ్యాలు ఉన్నాయి.

- చుంగ్ గై చున్ వాగు పునరుజ్జీవనం ప్రాజెక్టులో మూసీ తరహాలో వ్యతిరేకత వచ్చిందని, చిరు వ్యాపారులను అక్కడి నుంచి తరలించి, ఆతర్వాత వారికి ప్రాజెక్టులో భాగస్వామ్యం కల్పించినట్టు ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి అవాస్తవాలు చెప్పారు. వాస్తవానికి చుంగ్ చై చున్ ప్రాజెక్టులో ఒక్క నిర్మాణాన్నీ కూల్చలేదు. ఒక్క వ్యక్తిని కూడా తరలించలేదు.
- చుంగ్ గై చున్ ప్రాజెక్టులో గతంలో నది మధ్యలో ఉన్న ఎక్స్‌ప్రెస్‌వేను కూల్చివేసి, ఆ శిథిలాలను పక్కన వేయడం వల్ల తమ వ్యాపారాలు దెబ్బ తింటున్నాయని, రోడ్డు లేక పోవడం వల్ల పర్యాటకులు ఎలా వస్తారని అక్కడి వాణిజ్య సముదాయాల్లో కిరాయి తీసుకొని వ్యాపారాలు నిర్వహిస్తున్న వారు ఆందోళన వ్యక్తం చేశారు.
- దీంతో అక్కడి ప్రభుత్వం 2003-05 వరకు మూడేండ్ల పాటు వారికి పలు రకాల పన్నుల రాయితీ కల్పించింది. వ్యాపార వేళలు రాత్రి 10 గంటల నుంచి ఒకటిన్నర గంటల వరకు పొడగించింది. పర్యాటకులు వాణిజ్య సముదాయాల్లోకి వచ్చేలా చిన్న చిన్న రహదారులు నిర్మించింది.
- కానీ మూసీ అంశం వేరు. ఇక్కడ ఏకంగా నిర్మాణాలు కూల్చివేసి ఇక్కడ నివసిస్తున్న ప్రజలను వేరే చోటుకు తరలిస్తున్నారు. ఆ ప్రదేశాల్లో పీపీపీ విధానంలో ప్రైవేట్ కంపెనీలకు ఆకాశహర్మ్యాల నిర్మాణానికి అవకాశం కల్పిస్తామని చెప్తున్నారు.

వైద్యశాఖలో క్రమబద్ధీకరణ కొందరికేనా?

- వందలాది మంది 2021 బ్యాచ్ నర్సుల అవస్థలు
- 6 నెలలుగా నిర్లక్ష్యంతో నాన్చుతున్న అధికారులు

హైదరాబాద్, అక్టోబర్ 23 (నమస్తే తెలంగాణ): వైద్యారోగ్య శాఖలో 2021 బ్యాచ్ నర్సింగ్ ఆఫీసర్లు/స్టాఫ్‌నర్సుల క్రమబద్ధీకరణ అస్తవ్యస్తంగా సాగుతున్నది. అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా ఈ ప్రక్రియ ఆరు నెలలుగా కొనసాగుతూనే ఉన్నది. ఇప్పటికీ వందలాదిమంది ఆర్డర్ల కోసం ఎదురుచూస్తున్నారు. 2021లో ప్రభుత్వం 2,418 మంది స్టాఫ్ నర్సులను నియమించగా, నిరుడు ఆగస్టు నాటికి వారి రెండేండ్ల ప్రొబేషనరీ పీరియడ్ ముగిసింది. తర్వాత వారి సర్వీస్ క్రమబద్ధీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. అయితే ఈ ఏడాది ఫిబ్రవరి వరకు ఒక్కరి ఉద్యోగం కూడా క్రమబద్ధీకరణ జరగలేదు. ఈ ఏడాది ఫిబ్రవరిలో మహబూబ్‌నగర్ జిల్లాలో 27 మంది స్టాఫ్ నర్సులను రెగ్యులరైజ్ చేశారు. దీనిపై 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితం కావడంతో రెండు రోజులకే మరో 434 మందిని క్రమబద్ధీకరించారు. మిగతావారికి దఫదఫాలుగా క్రమబద్ధీకరణ చేస్తున్నారు. ఆరు నెలలు గడిచినా ఇప్పటికీ డీపీహెచ్ విభాగంలో 600 మందికిపైగా ఉత్తర్వుల కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు.

పారదర్శకంగా పదోన్నతులు చేపట్టండి సీనియర్ నర్సింగ్ ఆఫీసర్లకు త్వరగా పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వ నర్సెస్ అసోసియేషన్ బుధవారం డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ రవీందర్ నాయక్‌ను కోరింది. ఈ మేరకు బుధవారం అసోసియేషన్ ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు.

నిబంధనలకు విరుద్ధంగా వైద్యుల నియామకం

హైదరాబాద్, అక్టోబర్ 23 (నమస్తే తెలంగాణ): డీఎంఈ, టీవీవీవీపీ పరిధిలోని స్పెషలిస్ట్ వైద్యులను ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల్లో నియమించడం సర్వీస్ రూల్స్‌కు విరుద్ధమని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం పేర్కొన్నది. ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు తెలిపింది. టీజీజీడీఏ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ తొలి కార్యవర్గ సమావేశం బుధవారం హైదరాబాద్‌లో జరిగింది. ప్రభుత్వ వైద్యుల కోసం హైదరాబాద్‌లోని వైద్య భవన్‌ను పునరుద్ధరించి, త్వరలోనే అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తామని రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నరహరి, డాక్టర్ లాలుప్రసాద్ రాథోడ్ తెలిపారు.

ధనికులకు నోటీసులు పేదలపై కఠిన చర్యలు

- హైకోర్టులో కేఏ పాల్ ఆవేదన

హైదరాబాద్, అక్టోబర్ 23 (నమస్తే తెలంగాణ): అక్రమ కట్టడాల పేరుతో హైడ్రా నోటీసులు ఇవ్వకుండా ఇండ్ల కూల్చివేతలు చేపడుతున్నదని ప్రజా శాంతి పార్టీ వ్యవస్థాపకుడు కేఏ పాల్ ఆవేదన వ్యక్తం చేశారు. హైడ్రా తీరును వ్యతిరేకిస్తూ వ్యక్తిగత హోదా లో పాల్ దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యంపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ శ్రీనివాస్‌రావు ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ చేపట్టింది. ప్రభుత్వం సర్వే నిర్వహించే వరకు భవనాలను కూల్చివేయరాదని హైడ్రాకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని పాల్ కోరారు.బాధితులకు నోటీసులు జారీ చేయాలని, వారు కోర్టును ఆశ్రయించేందుకు లేదా ఇండ్లను ఖాళీ చేసేందుకు కనీసం నెల గడువు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై అదనపు అడ్వకేట్ జనరల్ ఇమ్రాన్‌ఖాన్ స్పందిస్తూ హైడ్రా ఏకపక్షంగా వ్యవహరించడం లేదని, నోటీసుల జారీ తర్వాతే అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్నదని తెలిపారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. మధ్యంతర ఉత్తర్వుల జారీకి నిరాకరించింది. పిల్‌పై కౌంటర్లు దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ.. తదుపరి విచారణను 3 వారాలకు వాయిదా వేసింది.

'బస్తీ'మే సవాల్!

కూల్చివేతలకు వ్యతిరేకంగా 'బస్తీల జేఏసీ'

ప్రజల అనుమతి లేకుండా ఇంట్లోకే రాకూడదు.. అలాంటిది ఇల్లునే కూల్చేసే హక్కు మీకెవ్వరిచ్చారు?
- బస్తీల జేఏసీ ప్రశ్న

కాంట్రాక్టర్లు, రియల్ ఎస్టేట్ ఏజెంట్లు, కంపెనీలతో చర్చలు జరపడం కాదు.. ఇక్కడి ప్రజలతో చర్చించండి..ఇక్కడ నివసిస్తున్న ప్రజలతో కలిసి వారి అనుమతితో మూసీ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లండి..
- సీఎం రేవంత్‌రెడ్డికి బస్తీల జేఏసీ సూచన

- నిర్వాసితులకు అండగా ప్రజా, దళిత సంఘాలు, ముస్లిం అసోసియేషన్స్ కలిసి ఏర్పాటు
- 'మూసీ జన్ ఆందోళన్' పేరిట పోస్టర్లు పోస్ట్
- కూల్చితే సహించేది లేదని హెచ్చరిక

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 23 (నమస్తే తెలంగాణ) : మూసీ కూల్చివేతల భయంతో ఇన్నిరోజులూ కంటిమీద కునుకు లేకుండా గడిపిన బస్తీలు ఇప్పుడు 'బస్తీ మే సవాల్' అంటూ బరిగీసి నిలబడ్డాయి. కూల్చివేతలకు వ్యతిరేకంగా 'బస్తీల జాయింట్ యాక్షన్ కమిటీ' ఏర్పాటైంది. సుందరీకరణ పేరుతో ఇండ్లు కూల్చితే సహించేది లేదంటూ బస్తీల జేఏసీ హెచ్చరించింది. ప్రజల భాగస్వామ్యం లేకుండా ఏకచ్ఛత్రాధిపత్యంతో సీఎం రేవంత్‌రెడ్డి తన ఇష్టానుసారంగా నిరుపేదల జీవితాలను కబలించడాన్ని వ్యతిరేకిస్తున్నట్టు ప్రకటించింది. మూసీ నిర్వాసితులను కాపాడుకోవడంలో భాగంగా ప్రజా సంఘాలు, దళిత సంఘాలు, ముస్లిం అసోసియేషన్స్ సంయుక్తంగా బస్తీల జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పడ్డాయి. ఈ మేరకు వాళ్లంతా సోషల్ మీడియాలో 'మూసీ జన్ ఆందోళన్' పేరిట పోస్టర్లను పోస్ట్ చేశారు. ఇప్పుడివి విస్తృతంగా వైరల్ అవుతున్నాయి. బఫర్ జోన్‌లో నివసిస్తున్న ప్రజలు ఎక్కడికీ కదలరని స్పష్టం చేసింది. మూసీ రివర్ బెడ్ ప్రాంతంలో నివసిస్తున్న ప్రజల ఇండ్లకు మార్కెట్ విలువను కట్టి ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని, నగరంలో సమానమైన స్థలాన్ని కేటాయించాలని, మూసీ రివర్ బెడ్ ప్రాంతంలో నివసిస్తున్న కిరాయిదారులందరికీ డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేసింది. మూసీ నివాసాలకు ఇబ్బంది లేకుండా అభివృద్ధి జరిగేలా ప్రణాళికలు రచించుకోవాలని తెలిపారు. మూసీ నదిపై ప్రభుత్వానికి నిజంగా ప్రేమ ఉంటే ముందుగా నదిలో పూడిక తీసి ఇందులో పారిశ్రామిక వ్యర్థాలు కలవకుండా చూడాలని హితవు పలికారు.

- హైదరాబాద్‌లోని చెట్లపై హైడ్రా సమీక్ష

హైదరాబాద్ నగరంలో వృక్షాల పరిరక్షణతోపాటు ప్రమాదకరంగా మారిన చెట్లకు సంబంధించి బుధవారం హైడ్రా కార్యాలయంలో కమిషనర్ రంగనాథ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. దీనికి జీహెచ్‌ఎంసీ, అటవీ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రంగనాథ్ పలు సూచనలు చేశారు.

మూసీ సమస్యలు రాసివ్వండి: పొన్నం

హైదరాబాద్, అక్టోబర్23 (నమస్తే తెలంగాణ): మూసీపై సమస్యలేవైనా ఉంటే తమకు లిఖిత పూర్వకంగా ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర నాయకత్వానికి, ఎంపీలకు హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని తెలిపారు. సియోల్ పర్యటన తర్వాత పునరావాసం విషయంలో నిర్వాసితులకు అన్యాయం జరగకుండా చూసే బాధ్యత ప్రభుత్వానిదేనని వివరించారు. అవకాశవాద రాజకీయాలు చేస్తూ ధర్నాలు, నిరసనల పేరిట మొసలి కన్నీరు కార్చడం సరికాదని, తెలంగాణ అభివృద్ధి కోసం పాటు పడాలనుకుంటే మూసీ ప్రాజెక్టుకు బీజేపీ నేతలు సహకరించాలని సూచించారు.

స్మార్ట్ సిటీల సందర్శన

దక్షిణ కోరియా పర్యటనలో భాగంగా ఇంచియాన్ నగరంలో భాగమైన మూడు అంతర్జాతీయ స్మార్ట్‌సిటీలు చియోంగ్గ, సాంగడో, యెంగ్‌జంగ్‌లను మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మల్రెడ్డి రంగారెడ్డి, కాలే యాదయ్య, ప్రకాశ్ గౌడ్, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్ తదితరులు సందర్శించారు.

కన్నబిడ్డనే విక్రయించిన తండ్రి

తల్లడిల్లిన తల్లి.. చిన్నారిని తల్లి ఒడికి చేర్చిన పోలీసులు

వేములవాడ పోలీస్‌స్టేషన్‌లో పది మాసాల కూతురు మేఘనతో తల్లి శ్యామల

వేములవాడ, అక్టోబర్ 23: మద్యం మత్తులో ఉన్నాడో.. ఆర్థిక అవసరాలకో తెలియదు గానీ.. ఏకంగా కన్నబిడ్డనే విక్రయించాడో తండ్రి. దీంతో ఆ తల్లి బిడ్డ కోసం తల్లడిల్లింది. చివరికి పోలీసుల సాయంతో ఆ చిన్నారి క్షేమంగా తల్లి ఒడికి చేరింది. ఈ ఘటన బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో చోటుచేసుకుంది. వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్‌లో ఉండే బత్తుల రవీందర్-శ్యామల దంపతులకు ఐదుగురు సంతానం. దీంతో రవీందర్ తమ పది నెలల కూతురు మేఘనను ఎవరైనా కొంటే ఇస్తామని మధ్యవర్తులకు చెప్పాడు. విషయం తెలుసుకున్న జగిత్యాలకు చెందిన లక్ష్మి మంగళవారం వేములవాడకు చేరుకొని రవీందర్‌కు రూ.90 వేలు ఇచ్చి బిడ్డను కొనుగోలు చేసింది. కూతురు కనిపించకపోవడంతో శ్యామల పోలీసులను ఆశ్రయించింది. జగిత్యాల జిల్లా వాసులు కొనుగోలు చేసినట్టుగా గుర్తించిన పోలీసులు చిన్నారిని తీసుకొచ్చి తల్లికి అప్పగించారు. కూతురిని అమ్మిన తండ్రి రవీందర్‌తోపాటు కొనుగోలు చేసిన వారిపై కూడా కేసు నమోదు చేశామని సీఐ వీరప్రసాద్ తెలిపారు. సంతానం లేని తాను పిల్లలను పెంచుకోవాలన్న ఆసక్తితో చిన్నారిని కొనుగోలు చేశానని, ప్రాంసరీ నోటును చూపుతూ లక్ష్మి పోలీస్‌స్టేషన్‌లో బోరుమని విలపించింది.

గొంతులో దోశ ఇరుక్కొని వ్యక్తి మృతి

కల్వకుర్తి రూరల్, అక్టోబర్ 23 : దోశ గొంతులో ఇరుక్కోవడంతో ఓ వ్యక్తి మరణించాడు. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో చోటుచేసుకున్నది. స్థానికుల కథనం మేరకు.. కల్వకుర్తి పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన ఉప్పరి వెంకటయ్య (43) బుధవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో హోటల్ నుంచి దోశ తీసుకొచ్చాడు. అనంతరం తింటుండగా గొంతులో ఇరుక్కోవడంతో ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందాడు.

కుటుంబ తగాదాలో కాంగ్రెస్ నాయకుల జోక్యం!

- వ్యక్తిపై దాడి.. తీవ్రమనస్తాపం..
- సెల్ఫీ వీడియో తీసి ఆత్మహత్యకు యత్నం
- పరిస్థితి విషమం.. ఎంజీఎంలో చికిత్స

సెల్ఫీ వీడియో తీస్తూ పురుగుల మందు తాగుతున్న రాజేశ్

ములుగు, అక్టోబర్ 23 (నమస్తేతెలంగాణ): భార్యాభర్తల గొడవలో కాంగ్రెస్ నాయకులు తలదూర్చి భర్తపై దాడి చేయడంతో మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఘటన ములుగు జిల్లా కేంద్రం సమీపంలోని మ